# రకరకాల భార్యలు

## అందమైన భార్య

"అందమైనవస్తువు నిత్యానందకరం" అన్నాడు కీట్సు. అందంగా పుట్టడం ఒక వరం. సౌందర్యోపాసనకోసమే జీవిస్తారు కొందరు కళాహృదయులు. కళారాధనే వాళ్ళ జీవితాశయం.

అందాన్ని పూర్తిగా నిర్వచించడం కష్టమే. దానివల్ల కలిగే ఆనందంకూడా అనుభవైకవేద్యమేకాని మాటల్లో చెప్పజాలినది కాదు.

రోడ్డుమీద ఒక సౌందర్యవతి పోతుంటే మన దృక్కులు వాటంతటవే నిల్చిపోతాయి. దాన్నే 'అరెస్టింగ్ బ్యూటీ' అంటాం. "అబ్బ! ఏంసౌందర్యం!" అని నివ్వెరబోతూ కళ్ళతోనే అప్రయత్నంగా ఏదో ఆనందాన్ని గ్రోలడానికి ప్రయత్నిస్తాం. ఇది సాధారణమైన విషయమే!

అలాగే ఒకఅందగాడు పోతుంటే స్త్రీలూ చూస్తారు-కాని మగవాడు చూసినట్లు చూసేంత పూర్తిధైర్యం యుగయుగాల్నుండి అణగద్రొక్క బడినవాళ్ళ కుండదు. సిగ్గనే పరదాలో తరతరాలుగా వాళ్ళు దాచబడి వుండడంవల్ల కనుకొలకుల్లోనుంచే చూసి ఆనందిస్తారంతే! ఎందువల్ల జరుగుతుందిది? వాళ్ళేమనుకుంటారు? చూచేవాళ్ళేలా భావిస్తారు? అనే ఆలోచనే తోచదు.

నగ్నసత్యంలాగే నగ్నచిత్రాలన్నా భయపడే మనుషుల కీ కాలంలో ఈ లోకంలో కొరతలేదు.

ఇంతో అంతో చిన్నప్పట్నించి చిత్రకళమీద అభిమానం వుండడంవల్ల అందమైన బొమ్మలన్నీ చిత్రించడం నేర్చుకున్నాను. వాటివల్లే సౌందర్యోపాసకుణ్ణవగలిగానని అనుకుంటా నిప్పటికీ. చిత్రాల్ని చూసి ఆనందించడం వేరు. అందమైన చిత్రాల్నీ, శిల్పాలనీ సృష్టించి ఆనందించడం వేరు! ఒక ఉత్తమమైన కథను సృష్టించినప్పుడు కలిగే అనిర్వచనీయానందంవంటిదే చిత్రకారులకికూడా కలుగుతుంది.

'అందమైన భార్యని పెళ్ళిచేసుకోవాలి; జీవితాన్ని ఆనందదాయకం చేసుకోవాలి! ఆమెనే 'మోడల్'గా చేసుకుని ప్రపంచ ప్రఖ్యాతిపొందే చిత్రాల్ని చిత్రించగలగాలి! అదే నా కనీసపు కోర్కె, ఆశయమూను!

ఆ ఆశయసాధనకి మామూలు కుటుంబాలనుండి వచ్చే సాధారణపు పెళ్ళికూతుళ్లు పనికిరారు. వాళ్లు వాళ్ల చాదస్తాలతో మన ఆశయాల్ని అర్థంచేసుకోకపోవడమే కాకుండా, మన్నికూడా అధఃపతనానికి లాగుతారు. అందుకని చదువుకుని, సంస్కారంకలిగి, మన ఆశయాల్తో ఏకీభవించే అమ్మాయైయుండాలి.

అన్ని హంగుల్నీ కలిగి కాలేజీ వైఖరినే ఆ రెండు మూడేళ్ళ మధ్య మార్చిన, "మిస్. కాలేజ్" అనదగిన విద్యార్థిని మా క్లాస్‌మేట్ రుక్మిణి! వివిధ కార్యక్రమాలలో ముందుకొచ్చే చొరవకలిగినదీ, విద్యార్థులలో చనువుగా

మాట్లాడే సామర్థ్యం, సంస్కారం కలదీ అవడంవల్ల, రుక్మిణి నా స్వప్నలోకాలలో విహరించే ప్రేయసి అని అనుకున్నాను.

ఆ రోజుల్లో మా కాలేజీలో వైజ్ఞానిక సభలు జరుగుతున్నాయి. ఆవేళ సాయంత్రం కవిసమ్మేళనం జరిగింది. దేశంలోని మహాకవులు, అభ్యుదయ కవులు, ప్రజా కవులు, ప్రచార కవులు, గేయ కవులు, గద్య పద్య కవులు, పాటలు వ్రాసే కవులూ, సినిమా కవులు, విమర్శక కవులు, 'పేరడే' కవులు, శ్రీ శ్రీ మార్కు కవులు అనేక రకాలవాళ్ళొచ్చారు. వాళ్లని చూడ్డానికి, కావ్యశ్రవణానికి చాలమంది జనం గుమిగూడారు. చాలమంది కుర్రకవులకు అవకాశమియ్యకపోయినా సమావేశం ముగిసేటప్పటికి రాత్రి ఏ రెండో అయ్యే సూచనలు కనపడ్డాయి.

పదిగంటలప్పుడు రుక్మిణి కొంతమంది చెలికత్తెలతో బయలుదేరింది. దానితో కొందరు సౌందర్యోపాసకుల సంఖ్య తగ్గి, సభ బాగా పల్చపడింది.

సైకిల్ రిక్షామీద యింటికి బయలుదేరింది. నేనూ సైకిల్ మీద వెంబడించాను. రిక్షావాణ్ని సాగనంపి గుమ్మంలో అడుగు పెట్టిందో లేదో, నేను చప్పున వెళ్లి "రుక్మిణీ" అన్నాను. ఏదో వొకటి మాట్లాడి ఆ రాత్రే నిర్ణయించుకోవాలనే ఉద్దేశంతో.

"ఎవరు ?" అంది వెంటనే వెనుతిరిగి.

నేను ప్రత్యక్షమయ్యాను, నా కీ జన్మలో ఇవ్వబడిన చిరునవ్వునూ, సంతోషాన్నంతనూ ఒకేసారి మొహంమీదికి తెచ్చుకుంటూ.

"ఏం కావాలి ?" అంది.

"నీ ప్రేమ" అన్నాను, రెడీమేడ్ జవాబిస్తూ.

ఒక్క క్షణం ఆలోచించింది. నా మనస్సు సంతోషంతో గెంతింది. వొప్పుకోకమానదు.

"రుక్మిణీ!" అని దగ్గరకు సమీపించాను - దవడ పగిలింది.

"ఇటువంటి వేషా లెప్పుడూ వెయ్యకు"

తర్వాత తలుపు మూసిన చప్పుడు వినపడింది.

## 2

"ఇంటర్ పాసయ్యాను. పెళ్ళి చెయ్యాల్సిందే! ఎన్నో సంబంధాలు వొస్తున్నాయి అని అమ్మ గొడవ చెయ్యసాగింది.

అంతవరకూ "అప్పుడే పెళ్లేమిటే ?" అంటూ దాటు కుంటూ వచ్చాను.

నాన్న "అవును, నిజమే !" అన్నాడు.

నా గుండెల్లో రాయిపడింది- 'ఈసురో' మనే పిల్ల నెవర్నో అంటగడతార్రా, భగవంతుడా, అని.

నాన్న అంటే చాలా భయం. కాని అమ్మదగ్గర అంతు లేని గారాబం. అందుకని, అమ్మ చెవుల్లో వూదాను.

"వాళ్ళెట్రా! వాళ్ళు మనకి కావల్సిన వాళ్ళు కూడాను. మనం చేసుకుంటామంటే కళ్ళకద్దుకుని యిస్తారు. అయినా... పెళ్ళికూతుళ్ళు కరువైనట్లు వాళ్లని మనం ప్రాథేయపడి అడగడం ఏమిటీ ?" అంది.

మర్నాడు స్నేహాపుచూపులకని వెళ్ళినట్టు వెళ్ళింది. వాళ్లింతో మర్యాద చేశారుట. మాటలసందర్భంలోనే

పెళ్ళిమాటలు కలిశాయట. తర్వాత వాళ్ల నాన్న వచ్చి పెళ్ళిచూపుల కాహ్వానించడం, తాంబూలాలు పుచ్చుకోడం అన్నీ కలలోవలె జరిగాయి.

*  *  *  *

రాత్రి పదకొండయింది. పెళ్ళికూతురు జడలోని మల్లె పూలవాసన ప్రాణాలకు స్వర్గపుటంచుల చవి చూపిస్తోంది.

గుమ్మాన్ని పట్టుకు నుంచుంది. అందరూ వెళ్ళాక వెనకాలేవెళ్లి భుజాలు పట్టుకున్నాను. విదలించుకోబోయిన రెండుచేతులూ దొరికాయి. అదోలా మెలితిరిగి, నావైపు తలొంచుకునే తిరిగింది. చేతుల గాజుల గలగల కిలకిల నవ్వి నట్టు ధ్వనించింది. మల్లెపూల వాలుజడ తెల్లని చీరపై పడి వింతశోభని కలిగిస్తోంది.

"ఎందుకీ ప్రణయకోపం? ఇంకా నీ అయిదువేళ్ళ గుర్తు మాయలేదు చూడు" అని చెంప చూపాను.

రుక్మిణి చిరునవ్వు నవ్వుతో ఓరగా కనుకొలుకుల్లోంచి చూసింది. అందులో వ్యక్తిపశ్చాత్తాపం ప్రకటితమవసాగింది. చుట్టూ చెయ్యివేసి టేబిల్ వైపు నడిపించాను. ఎదటి అద్దంలో మా ప్రతిబింబాలు చూసుకుంటుంటే నాకు అదేలోకమో నని పించింది. ఏ అప్సరసగాని శాపంవల్ల భూలోకంలో పుట్టి రుక్మిణిగా కాలేదు కద!

తర్వాత చెప్పింది: ఎంతోమంది విద్యార్థులూ, అధ్యా పకులూ విజ్ఞాపనల దగ్గరనుండి ప్రేమలేఖలవరకూ ఎన్నో తాపత్రయాలు పడి తనని మోసగించాలనుకునేవారని.

"వాళ్ళ ఉద్దేశాలప్రకారం స్త్రీకి హృదయం లేదు. స్త్రీ కూడా తమలానే ఎవరినో ఒకరినే ప్రేమించి వైవాహిక జీవితాన్ని అభిలషించే మనిషి కాదు. ఆదిమజాతి అనాగరిక ప్రజల్లా స్త్రీని ఒక క్రీడావస్తువుగానో, లేక తక్కిన నిత్యావసర సామగ్రిలోని భాగంగానో భావిస్తా రనుకుంటాను.

"మీరూ అదేరోజుల్లో నన్ను వెంబడించారు. అందరికీ యివ్వబడిన సమాధానమే మీకూ వచ్చింది. ఎంతగా హృదయంలో బాధపడకపోతే ఆ క్షణిక నిర్ణయానికివచ్చి మిమ్మల్ని ఎదుర్కోగలిగా ననుకుంటారు ?

"నన్ను క్షమించండి! కాని... మీరు వేరువిధంగా నా ప్రేమని పొందదల్చినట్టయితే ఆ దుస్సంఘటన జరక్కపోయేది. ఆ నా చర్యకు తర్వాతరోజుల్లోని, మీ పతనాన్ని చూశాక - నాలో నేను ఎంత పశ్చాత్తాపాగ్నితో వేగా ననుకున్నారు ?"

"ఆయన ఎంత ప్రేమతో నన్ను వెంటాడారో? ఎంతగా నిరాశ కలిగించానో ? అని ఎంతో విచారించి ఆయనే నావాడయ్యేలా చూడమని ఎన్ని దేవుళ్లకి మొక్కుకున్నానో!"

రుక్మిణికళ్లు చెమ్మగిల్లాయి.

"అవును, నీ ప్రేమకోసమే నేను జన్మమెత్తింది. కష్టించిపొందిన ప్రేమే ఎక్కువ విలువైంది"

## 3

నాన్న ప్రమోషన్‌మీద మరోవూరు ట్రాన్సఫర్ అయ్యాడు. నన్ను చదువునుండి కదపడం యిష్టంలేక మమ్మల్ని యిక్కడే వుంచి వొంటరిగా వెళ్ళి పనిలో చేరాడు.

నేను బి. ఏ. చదవసాగాను. రుక్మిణి చదువు చాలించింది. మొదటియేడు కనక అంత శ్రద్ధతీసుకోకపోయినా ఫర్వాలేదనే ధైర్యం. హాజరువేయించుకుని ఎప్పుడూ ఇంటిదగ్గరే వుండేవాణ్ని.

అమ్మకి అస్తమానూ పనే. కొత్తకోడలు కదా అని రుక్మిణిని పనిచెయ్యనిచ్చేది కాదు. అమ్మ యిచ్చిన స్వాతంత్ర్యంవల్ల రుక్మిణి ఎప్పుడూ నా సాన్నిధ్యంలో వుండేది. ఉండాలని నే నో శాసనంకూడా ప్రకటించాను.

"అదేం బాగుంటుందండీ. మీా అమ్మగారు వూరుకున్నా, పైవాళ్లేమనుకుంటారు ?" అంది.

"వాళ్ళ మొహం!" అన్నాను.

పేకాట, కేరమ్సులలో కాలంగడిచేది. మధ్యలో దెబ్బలాటలు, మళ్ళీ వాళ్ల కీజన్మలో సంబంధముంటుందా అనుకునేటట్టు. అమ్మ తీర్పుచెప్పాలి! అమ్మ ఎలాచెబితే వాళ్ళదే ఆనాటి గెలుపు! నేను సాయింత్రంపూట చిత్రకళాభ్యాసం మానలేదు. ప్రస్తుతం నూనెరంగులతో కాన్వాస్‌లమీాద చిత్రాలుగీయటం మొదలుపెట్టాను. రుక్మిణి అవి వేస్తున్నంతసేపూ, ఏమీా తోచక బ్రష్‌లూ, అవీ దాచి గోలచేసేది. ఒకనాడు ఎంత అడిగినా యివ్వలేదు. నాకు కోపంవచ్చింది.

"నువ్వింత కళాహృదయంలేనిదాని వనుకోలేదు. అసలీ చిత్రకళారాధనే లేకపోతే నీ సౌందర్యానికి ముగ్ధుడనై, నీ ప్రేమకోసం తపించకపోదునేమో! నీ భావాలిలా నాకు వ్యతిరేకమవబోతాయని కలలోకూడా తలవలేదు" అని కొంచెం కఠినత్వం తెచ్చిపెట్టుకొని అన్నాను.

రుక్మిణి కళ్ళు నిండు గర్భిణీలైన మేఘాల్ని చవిచూశాయి. మౌనంగా అన్నింటినీ తిరిగి యిచ్చివేసింది. మళ్ళీ వాటిజోలికి రాలేదు.

ఒకరోజున, మనసులో అన్నాళ్లూ దాచుకున్న మాట అన్నాను – "రుక్మిణీ! నీ చిత్రాలు చిత్రించాలని వుంది" అని.

"ఎందుకు ?"

"నీ సౌందర్యం విలువ నువ్వు తెల్సుకోగలగడానికి"

"అది తెల్సుకున్నవారు మీరున్నారుగా - చాల్లెండి"

మొత్తంమీద ఎలాగయితేనేం రుక్మిణిది ఓ చిత్రం చిత్రించాను; మా దొడ్డిలోనున్న మామిడిచెట్టు నానుకొని నిలుచోబెట్టి, రుక్మిణి ఆ చిత్రంలో ఓ వనలక్ష్మిలా తయారైంది. నా మనసు సంతోషంతో వుప్పొంగిపోయింది, నా చిరకాలవాంఛ ఈడేరినందుకు.

కాని... రుక్మిణి ఆ చిత్రంయొక్క గొప్పతనాన్ని గుర్తించకపోవడంతో నా హృదయానికి దెబ్బ తగిలినట్టయింది. పదిరోజుల శ్రమా వృథా అయిందనుకున్నాను.

నా కోరిక ఎరుకపర్చాను; నా చిత్రాలకి ఏవిధంగా మోడల్‌గావుండి, నా కళోపాసనకి తోడ్పడవల్సిందీ - నా జీవితాశయమంతా వివరిస్తూ.

వింటున్న కొద్దీ రుక్మిణి మొదలంటా వొణికిపోసాగింది. నేను ఆశ్చర్యంలో మునిగాను. ఆశాభంగం మనసుని కరిగించసాగింది.

మర్నాడు ఆవిడే చెప్పింది; "మీ కళోపాసనకి నా సంపూర్ణసహకారం,అభినందన వుంది. నేను ఎప్పటికీ మీదాన్నే.

నా సౌందర్యం నా భర్తకి ఆనందాన్నిచ్చి, ఆయనకు అమితమైన ఆత్మీయురాలిగా అవడానికి నాకు తోడ్పడకలిగితే నా జీవితానికి అంతకంటె కావలసిందేమీ లేదు. అదే నా జీవితాదర్శమూను.

"కాని ఒక్క విషయంలోనే మీతో నేను ఏకీభవించలేకపోతున్నాను. మీ కళారాధనలో నేను సహాయకురాల్ని కాగలనుగాని సాధనాన్ని కాలేను. మీరు అతిరూపవతి ననుకుంటున్నా నన్ను మీ చిత్రాలలో చిత్రించి, తద్వారా ప్రజలకు సంతోషాన్నిచ్చి, పేరు ప్రఖ్యాతులు పొందదల్చివుండనచ్చు.

భారతదేశంలో పుట్టిన మూలాన్నేమి లేక పెంపకం వల్ల నేమి నేను చవకబారు స్త్రీలలా మగజాతి నంతనీ ఆకర్షించి; పాదాక్రాంతులుగా చేసుకుందామనుకునే తత్వం కలదాన్నిగా తయారు కాలేదు. నాకు జీవితంతో ఈయబడిన గొప్పవరం సౌందర్యమని తెలుసు. దానిద్వారా మీ కానందాన్ని చేకూర్చి నేనూ సుఖం పొందాలనే నా అభిలాష. అందుకనే, నేను మోడల్‌గా పనిచెయ్యలేను– క్షమించండి!"

ఒకమూల ఆశాసౌధం కూలిపోతున్నా, రుక్మిణి నా మనోనేత్రాన్ని తెరచి జ్ఞానోదయం కలిగిస్తున్న ట్టనిపించింది. అయితే ఈ చలన చిత్రాలద్వారానూ, ఇతర విధాల ప్రచారాన్ని ఆకాంక్షించే సౌందర్యవతులంతా చౌకబారు స్త్రీలేనా అనే భావన నాలో మొలకెత్తింది.

"అవును, నిజమే! రుక్మిణి నా పాలిటి జగన్మోహన మణి" అనుకున్నాను నాలో నేనే.

# 4

రోజులు ఎల్లకాలం ఒకరీతిగా దొర్లిపోవు - జీవితంలో వొడిదుడుకులు సముద్రపు పోటుపాటుల్లా వుంటాయి. అసలు జీవితమనే ప్రాణానికి సుఃఖదుఃఖాలు బొమ్మా బొరుసూను.

నాన్న ఆకస్మికమరణం పొందడం, అమ్మ వైరాగ్యం లోకి దిగి పుణ్యక్షేత్ర సందర్శనాలకోసం, దేశపర్యటన మొద లెట్టడం క్రమంగా జరిగాయి.

నా కెప్పుడూ ఇన్సూరెన్సు కంపెనీ వాళ్లు చెల్లించా ల్సిన డబ్బు, పొలాలమీద శిస్తువసూలు, ఇళ్ల అద్దెలూ, నాన్నకి రావాల్సిన యితర బాకీలూ చూడ్డం మొదలైన వాటితో సరిపోయేది. రుక్మిణిమీద అనంతమైన బాధ్యత (గృహసామ్రాజ్య మహాచక్రవర్తినిత్వం) పడింది.

ఓ రోజున యిద్దరం తీరుబడిగా కూచున్నాం. మాట లుగా మారలేని ఆలోచన లేవో మా మనసుల్ని పాలన చేస్తున్నాయి.

పక్కింటివాళ్ల రేడియోలోనుంచి "అందమె ఆనందం..." అని పాట వొస్తోంది. ఏదో జీవితాన్ని భారంగా గడుపుతున్నా మన్న మా ఓగాని మనసుల్లో ఆశించిన ఆనందపుఛాయల దరిదాపుల్లో కైనా చేరినట్లుగా తోచలేదు. రుక్మిణిని సాంఘి కమర్యాదలు తెలిసిన స్త్రీగా తయారుచేసి విందులకూ, టీ పార్టీలకూ, సినిమాలకూ, తీసుకుపోవాలని కుతూహలం ఎండి పోయి అణిగిపోయిన భావాల అట్టడుగుననుండి తిరిగి చిగిర్చ సాగింది.

పై ఆశయాన్ని సాధించడానికి నాకు ఆకస్మికంగా దొరికిన స్వేచ్ఛా, ధనంకూడా ప్రోద్బలాన్నివ్వసాగాయి...

ఒక సంవత్సరం గడిచింది. అప్పుడు మా జీవితాన్ని చూసినవాళ్ళు మొదట మేము ఏవిధంగా ఉన్నదీకూడా కనుక్కోలేదు.

పొద్దున్న ఏమాత్రం విశ్రాంతి వుంటుందో, ఏమో! మిగతా కాలమంతా ఎవరో మిత్రులు వస్తూనే వుంటారు. సాయంత్రం రెండు, మూడు బ్రిడ్జి టేబిల్సు తక్కువకాకుండా సాగుతాయి. డాక్టరు రామారావు డాక్టరు సుమతీ (వాళ్ళిద్దరూ భార్యా భర్తలు) రామరాజు అనే రేడియో వ్యాపారస్థుడు, ప్రతిభావతనే ఓ స్కూలు మిస్ట్రెస్, మరో ఇద్దరు, ముగ్గురు నిరుద్యోగ శిఖామణులూ భాగస్వాములుగా వుండేవారు. సుమతిని పగలుచూస్తే రాత్రి దుస్వప్నం కలిగించేంత అనాకారిగా వుంటుంది.

ఇంక అదివారాలు, మిగతా సెలవుదినాలు వొస్తే రోజస్తమానూ చీట్లాట ఎడతెగకసాగేది. అప్పుడప్పుడు పిక్నిక్లూ, సినిమాలకు పోడాలూ అనివార్యంగా సాగేవి. ఆ భోజనాలు, ఆ హాస్య ప్రయోగపు ఛలోక్తులూ, ఆ ఆనందం వర్ణించడం తరంకాదు.

రోజు లలాగే దొర్లుబాటైతే బాగుండేది. కాని రుక్మిణీకి అకస్మాత్‌గా టైఫాయిడ్ వచ్చింది.

రామారావు దంపతులు వైద్యం చెయ్యసాగారు. తక్కిన మిత్రులుకూడావచ్చి చూచి పోయేవారు. నేను చాలా గంటలవరుకు రుక్మిణికి సపర్యలు చేస్తోనే కూచునేవాణ్ని.

ఒకనాడు అలసటవల్ల విపరీతమైన తలనొప్పి వచ్చింది. నౌకరుతో అమ్మగారికి సపర్యలు చేస్తుండమని చెప్పి గాలి తాగేందుకు బయటకు పోయాను.

దారిలో మిత్రులు కలవడంవల్ల తిరిగి వచ్చేటప్పటికి రాత్రి 10 దాటింది. రుక్మిణి మంచంమీద పడుకునివుంది. పక్కన ఎవరో వ్యక్తి కుర్చీలో కూచున్నట్టు కనపడింది. వాళ్ళ మధ్య సంభాషణ జరుగుతున్నట్టుకూడా పొడగట్టింది. కాని చీకట్లో ఎవరో తెలీలేదు. నాగుండె కొట్టుకోసాగింది. పక్క గోడవద్ద దాగి మాటలు వినసాగాను. ఎప్పుడూ లేని దుర్బుద్ధి కలిగిం దెందువల్లో!

"కొందరి జీవితా లిలాగే వుంటాయి!"

"......ఊఁ!"

"ఒక్కొక్కప్పుడు సృష్టిలో అనేక వస్తువులు తమ నిజమైన ప్రయోజనాన్ని నెరవేర్చకండానే అడివిగాసిన వెన్నెలలా, బూడిదలో పోసిన పన్నీరులా, వృథా అవుతాయి."

"........"

"ఇదే ఇంకొకళ్ళయితేనా?"

"........"

"నెత్తిమీద పెట్టుకుని ఆరాధించేవాదు. ఇలా తన స్త్రీ కానట్టు, సంబంధంలేని దానిలా......"

ఒక నిట్టూర్పు.

"మీరు ఎప్పుడన్నా ఆయ న్నసలు మనస్ఫూర్తిగా ప్రేమించారా?"

ఈ ప్రశ్న వినేటప్పటికి నా వొళ్ళు మండిపోయింది. వెంటనే లేచి వెళ్ళి ఆ వ్యక్తి దవడ పగలగొడదా మనిపించింది. గబగబా అడుగులేసుకుంటూ వెళ్లాను.

ఎవ రదీ ? నిశ్చేష్టుండ్నయ్యాను. నా ఆలోచనలు అకస్మాత్తుగా కట్టుబడి పోయాయి ! ఎవరు ?

డాక్టర్ సుమతి !

ఏం చెయ్యాలో తెలీలేదు. రుక్మిణివైపు చూశాను. కన్నీళ్ళు చెంపలమీంచి ముత్యాల్లా దొర్లుతున్నాయి. నా నోటమాట రాలేదు.

"ఉష్ ! ...అటు నడవండి !" సుమతి ఆజ్ఞాపించింది ! హాలులోకి వొచ్చాం !

"ఇక్కడ కాదు; బయట"

తోటలోకి వెళ్ళాం. సిమెంట్ బెంచీమీద కూచున్నాం. వీధిలో విద్యుద్దీపపు కాంతి చెట్ల ఆకులమీద పడి, విరజిమ్మ బడి మామీద పడుతోంది.

సుమతి అనసాగింది : "నేను వచ్చేటప్పటికే ఏడుస్తో పడివుంది. ఎంతఅడిగినా చెప్ప లేదు. ఆవిడ అసలు సైకలాజికల్‌గా నెర్వస్. మీరు ఆవిణ్ని సరిగా చదివినట్టు తోచదు. ఈ పేకాటలూ, పార్టీలూ ఆవీ నచ్చనట్టుంది. అందు కే ఆరోగ్యం కూడా దెబ్బతిన్నట్టుంది. రైలు పట్టాలమీందే నడవాలి కాని. దారి తప్పిపోరాదు! అలాగే కొంతమంది. మనుషులుకూడా వారికి స్వభావసిద్ధమైన మార్గాల్లోనే జీవిస్తే సుఖించకలరుగాని కృత్రిమ వాతావరణాన్ని చిరకాలం భరించ లేరు. కొంతకాలం

భరించినా, మానసికారోగ్యాన్ని, శారీరక సౌఖ్యాన్నికూడా గోల్పోతారు.

"మీరు గమనించలేదు గాని – ఆవిడ ఎప్పుడో గుర్తిం చింది, ఈ 'స్నేహితులూ' తుక్కు మనుష్యులూ తన సౌంద ర్యారాధనకోసం, ఆస్వాదనకోసమే ఇక్కడ చేరుతున్నారు. కాని మీ స్నేహం మీదమోజువల్ల కాదని. ఏమీఅనుమానం లేకండా నిర్మలంగావుండే మీకు ఈ విషయాలన్నీ చెప్పి ఈర్ష్యా సూయలు కలగచెయ్యడ మిష్టం లేక మనస్సులో నే బాధపడుతూ సహించిం దిన్నాళ్లూ.

"ఇప్పట్నించైనా ఆ వేషాలన్ని మాని, యథార్థాన్ని గ్రహించి, మీ యిద్దరి జీవితాల్ని సుఖతరం చేసుకోండి."

నేను నిశ్చేష్టుడ్నై నిలిచాను. నా కళ్లనికప్పి, అన్నాళ్ళు నన్ను అజ్ఞానాంధకారంలో ఉంచిన నీలి మేఘాలన్ని అకస్మా త్‌గా విడిపోయినట్టయింది.

"భార్యా రూపవతీ..." అనే విషయం గుర్తుకొచ్చింది.

అందమైన భార్యలూ అందరి విషయాల్లోనూ శత్రు వులు కాదు – కాని వాళ్ల హృదయాల్నర్థం చేసుకోకండా, భ్రమించి చుట్టూచేరే 'మిత్రబృందమే' నిజమైన శత్రువులు అనుకున్నాను.

రుక్మిణి జ్వరం తగ్గడానికి మరో పక్షం పట్టింది. తర్వాత ఆ వూరు వదిలేశాను. శాశ్వతంగా కొత్తపూళ్లో బూజుపట్టిన భ్రమల్ని దులుపుతూ, మళ్ళీ కొత్తజీవితాన్ని ప్రారంభించ సాగాను, నా అందమైన భార్య రుక్మిణితో.